మహిళా హోంగార్డు ఇంటికి వెళ్ళిన హోంమంత్రి అనిత

విశాలాంధ్ర-విజయనగరం : ఆమె రాష్ట్రానికి హోంశాఖా మంత్రి సాదారణంగా ఆమెను కలవాలన్నా అనుమతి కష్టమే. ఇక మహిళా హోంగార్డులు ఆమెతో కలిసి టీ, కాఫీలు తాగుతారా..? కానీ ఇటువంటి వాటికి తాను దూరమని కిందస్థాయి నుంచి పైస్థాయి వరకు అందరిపట్ల ఆప్యాయత కలిగి వుంటానని హెూంమంత్రి వంగలపూడి అనిత విజయనగరంలో స్వయంగా చేతల ద్వారా తెలియజేసారు. విజయనగరం పట్టణంలో పోలీస్ క్వార్టర్సులో ఉంటున్న సీనియర్ మహిళా హెూంగార్డు ప్రమీల ఇంటికి హెూంమంత్రి శనివారం నేరుగా వెళ్ళారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సాక్షాత్తు హెూం మంత్రి తమ ఇంటికి రావడంతో మహిళా హెూంగార్డు కుటుంబసభ్యులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. అనంతరం ఇంట్లో కూర్చుని కాఫీ తాగుతూ మహిళా హెూంగార్డు ఉద్యోగ వివరాలను, ఆమె ఆరోగ్యంతోపాటు కుటుంబ పరిస్థితిలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెూంగార్డుకు చీర పండ్లు, స్వీట్లు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. ఈకార్యక్రమంలో హెూంమంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ కూడా ఉన్నారు.

మహిళా దినోత్సవం రోజున విభిన్న ప్రతిభావంతుల వివాహం : భీశెట్టి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం శ్రీవిజయదుర్గా సంక్షేమ సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ ఇజ్రాస్ అసోసియేషన్ నాయకుదు దవడ కొండబాబు అద్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు రెండు జంటలు శ్రీ సత్య,(కొండమ్మ)నారాయణ రావు, విజయలక్ష్మి, వెంకట సత్య ఆచారిల ఆదర్శ వివాహం జరిపించడం అభినందనీయమని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు, శనివారం పెద్ద చెరువు గట్టున ఉన్న దుర్గమ్మ గుడిలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ శ్రీ విజయ దుర్గ సంక్షేమ సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాల అసోసియేషన్ వారు విజయనగరం జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల కోసం, పేదల కోసం, అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, అందులో భాగంగా జ్యూట్ బ్యాగులు తయారుచేసే కేంద్రాన్ని ఏర్పాటు చేసి చాలా మందికి ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. కొండబాబు బృందం పెద్ద మనసుతో నిత్య అన్నదానం చేస్తూనే రెండు జంటలకు తల్లిదండ్రులు లేని లోటు తీరుస్తూ ఆదర్శ వివాహం చెయ్యడం గొప్ప అంశమని భీశెట్టి అన్నారు. ఈవివాహ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్లు ఐ. వి.పి.రాజు, కనకల మురళీ మోహన్, పైడిరాజు, స్వచ్ఛంద సంస్థల నాయకులు ఇప్పలవలస గోపి,మమ్ముల తిరుపతిరావు, దవడ మీనా, స్రవంతి, అరుణమ్మ, పెద్ద సంఖ్యలో విభిన్న ప్రతిభావంతులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

తాగునీటి సమస్యలపై వలిరెడ్డి పరిశీలన

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణ పరిధిలో త్రాగునీటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు కోరారు. శనివారం నాడు చీపురుపల్లి పట్టణ పరిధిలోని పలు వీధులలో పర్యటించి తాగునీటి సమస్యల పైన ఆయన ఆరా తీశారు. వీధికులాల ద్వారా ఏర్పాటు చేసిన పైపులైన్లకు ఎటువంటి మరమ్మత్తులు అవసరం, వాటిని కూడా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటి కులాల ద్వారా సరఫరా అవుతున్న త్రాగునీటికి ఆటంకాలు లేకుండా త్రాగునీరు సరఫరా చెయ్యాలన్నారు. వి.వి. పట్టణంలోని పిల్ల పేట, దేవాంగుల వీధి ప్రాంతాలలో పర్యటించి మహిళలతో త్రాగునీటి సమస్యల పైన చర్చించారు. ప్రత్యేకించి త్రాగునీటి కొరకు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొత్త పైప్ లైన్ లో ఎటువంటి సమస్యలు వాటిల్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సతివాడ ఆదికృష్ణ, కొణితల గొల్ల, ప్రభాత్ కుమార్, వెంకీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

133 గ్రామ పంచాయితీల పెద్దలతో ఎస్ఐ సమావేశం

విశాలాంధ్ర-తెర్లాం : మండల కేంద్రంలో స్థానిక ఎస్ఐ సాగర్ బాబు అధ్యక్షతన 33 గ్రామ పంచాయితీల పెద్దలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఎస్ ఐ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపు లకు పెట్టేందుకు ఎవరు సహకరించవద్దని, గ్రామ దేవత పండగలు పేరుతో మీ గ్రామాల్లో బెల్ట్ షాపులు వేలం పాడి వచ్చే లక్షల రూపాయిలు తో గ్రామ దేవత పండగలు చేస్తాం, రికార్డ్ డాన్స్‌లు పెడతాం మీ పెద్దరికాలు నిలబెట్టుకుంటామంటూ ఎక్కడికక్కడ వేలం పాట పెట్టి, ఈ మండలంలో పోలీస్ డిపార్ట్మెంట్‌ను ఇబ్బందులకు గురిచెయ్యకండి అని పెద్దలకు కోరారు. ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం సి ఏం ఆదేశాలు ప్రకారం ఎక్కడ బెల్ట్ షాపులు గ్రామాల్లో ఉన్న ఊరుకునేది లేదని, బెల్ట్ షాపులు కు సహకరించిన లైసెన్స్ షాప్ లను రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది అని ఈ విష్యం దృష్టిలో పెట్టుకొని చట్టం పని చేయాలని పై నుంచి ఆదేశాలు ఉన్నాయని అన్నారు. ఎన్ని చెప్పినా మీ మీ గ్రామాల్లో బెల్ట్ షాప్ల కు వేలం పాటలకు సహకరిస్తే చట్టం తను పని తాను చేసుకుపోతుందని, ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని అన్నారు. ఇక్కడకి వచ్చిన గ్రామాల పెద్దలు అంత ఎక్కడ మద్యం అక్రమ అమ్మకాలు జరగకుండా, వేలం పాటలు కు సహకరించకుండా ఉండాలని ఈ సమావేశం లో తెర్లాం ఎస్ ఐ సాగరబాబు గ్రామాల పెద్దలను కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర-లక్కవరపుకోట: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం లక్కవరపుకోట మండల కేంద్రంలో నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో నిర్వహించిన సందర్భంగా ఆమె ఐదు మండలాల ప్రజల నుంచి భారీ ఎత్తున ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో ప్రధానంగా హౌసింగ్ స్కీము బకాయిలు విడుదల బకాయిలు , ఇళ్ల స్థలాలు, కొత్త రేషన్ కార్డులు, రోడ్డు నిర్మాణాలు, విద్యుత్ సమస్యలు, ముఖ్యంగా జామి మండలం కిర్ల గ్రామానికి తాగునీటి సమస్య, మండల కేంద్రానికి వివిధ పనులు పైన రాకపోకలు సాగించడానికి అతి దగ్గర రోడ్డు మార్గము నిర్మాణమునకు స్థల సేకరణ గురించి ఆ మండల దళిత నాయకులు, 25 పైగా వినతి పత్రాలు సేకరించడం జరిగిందని ఆమె తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కూట మీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు కార్యక్రమంను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-వేపాడ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి,జిల్లా పార్టీ అధ్యక్షులు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో గల కంటోన్మెంట్ మున్సిపల్ పార్కు ఆవరణలో ఈనెల 12న బుధవారం ఉదయం 9గంటల సమయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణతో పాటు యువత పోరు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పోరు అనే నినాదంతో విద్యార్థులు,నిరుద్యోగులు, యువత ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సంఘీభావంగా కంటోన్మెంట్ మున్సిపల్ పార్కు,నెహ్రూ యువ కేంద్రం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి విద్యార్థులు,నిరుద్యోగులు సమస్యలపై కలెక్టర్‌కి వినతిపత్రం అందజేయడం జరుగుతుందని, ఈర్యాలీ కార్యక్రమంలో జిల్లాలోగల మాజీ ఎమ్మెల్యేలు,ప్రస్తుత ఎమ్మెల్సీలు, జిల్లాస్థాయి నాయకులు పాల్గొంటారని, కావున మండలంలో వివిధ హెూదాలలో పనిచేసిన మాజీ చైర్మన్లు డైరెక్టర్లు, ఎంపీపీ,జడ్పిటిసిలు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు నిరుద్యోగులు యువత అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జాతీయ లోక్ ఆదాలత్‌లో ఒక వెయ్యి 114 కేసులు పరిష్కారం

మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్ అరుణశ్రీ

విశాలాంధ్ర-బొబ్బిలి : వివిధ కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులను కక్షిదారులు సత్వర న్యాయానికి జాతీయ లోక్ ఆదాలత్ లో రాజీ మార్గంలో కేసులను పరిష్కారం చేసుకుంటే విలువైన సమయముతో పాటు డబ్బు ఆదా అవుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్ అరుణశ్రీ పిలుపునిచ్చారు. శనివారం జరిగిన జాతీయ లోక్ ఆదాలత్ లు ఒక వెయ్యి 114 కేసులు పరిష్కారం చేశారు. ప్రోనోట్ కేసులు 8, సివిల్ టైటిల్ మూడు, ఈపీలు ఆరు, పిలుపు దావా ఒకటి, చెక్ బౌన్స్ కేసులు రెండు, మనోవర్తి కేసులో 4, గృహ హింస కేసు ఒకటి, ఐపీసీ 111 కేసులు, ఎక్సైజ్ కేసులు 80, ఎస్ టి సి ఎనిమిది వందల తొంబై మూడు కేసులు, పి ఎల్ ఐ ఒకటి, బిఎస్ఎన్ఎల్ కేసులు నాలుగు కేసులు రాజీమార్గంలో పరిష్కారం చేసినట్లు మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్ అరుణశ్రీ విలేకరులకు తెలిపారు. పెద్ద ఎత్తున కేసులు పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ శాఖకు, ఎక్సైజ్ శాఖ సిబ్బందికి, న్యాయవాదులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పి మురళీమోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీమల మందు తాగి మహిళ మృతి

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలం ముల్లిపేట గ్రామానికి చెందిన చందక రామలక్ష్మి (60) అనే మహిళ చీమల మందు తాగి మృతి చెందింది. చీపురుపల్లి పోలీసుల కథనం మేరకు ముల్లుపేట గ్రామానికి చెందిన రామలక్ష్మి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇబ్బందులకు గురవుతుంది. అనారోగ్యపు బాధలు భరించలేక ఈనెల ఐదున ఇంటిలోనే చీమల మందు సేవించింది. అనంతరం కుటుంబ సభ్యులకు తెలియడంతో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రధమ చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం నాడు మృతి చెందింది. ఆమె కుమారుడు చంద్రక ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీపురుపల్లి ఎస్సై ఎల్ దామోదర్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా దినోత్సవం రోజున ఉద్యోగాల తొలగింపు అన్యాయం

వెంకటరమణ పౌల్ట్రీ ఎదుట మహిళా ఉద్యోగుల ఆందోళన

విశాలాంధ్ర-చీపురుపల్లి : మహిళలను అని కూడా చూడకుండా మహిళా దినోత్సవం రోజునే ఉద్యోగాల నుంచి తొలగిస్తూ చీపురుపల్లి మండలంలోని కర్లాం గ్రామానికి చెందిన శ్రీ వెంకటరామ పౌల్ట్రీస్ యాజమాన్యం నిరంకుశ ధోరణికి పాల్పడిందని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం నిరంకుశ తత్వానికి నిరసనగా శనివారం సుమారు 25 మంది ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు నాయకులు గౌరునాయుడు సామర్థ్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో బాధిత మహిళా ఉద్యోగులు వారి ఆవేదన వ్యక్తం చేశారు. కర్లాం చుట్టుపక్కల గ్రామాలలో నివసిస్తూ గత 13 సంవత్సరాల నుంచి ఇదే కంపెనీలో పనిచేస్తూ మాకుటుంబాన్ని పోషించుకుంటున్న తమకు బదిలీల పేరుతో కంపెనీ యాజమాన్యం వేధిస్తుందని మహిళలు వాపోయారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని చూడకుండా చదువురాని మమ్మల్ని బలాత్కారంగా చత్తీస్‌ఘడ్‌కి బదిలీ చేయదానికి కంపెనీ యాజమాన్యం కుట్ర పండుతుందని వారు ఆరోపించారు. యాజమాన్యం చెప్పినట్లు బదిలీపై వేలకపోతే తమన ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ యాజమాన్యం తమను వేధింపులకు గురి చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీ పైన వెళ్లకుంటే మీరంతా గేటు బయట ఉండాలంటూ కంపెనీ యాజమాన్యం తమను కంపెనీ నుండి బయటికి నెట్టు వేయడంతో కంపెనీ గేటు వద్దే నిరసన కార్యక్రమం చేపట్టమని వారు వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మాకు యాజమాన్యం గొప్ప బహుమతి ఇచ్చింది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం దుర్మార్గపు చర్యల పట్ల రెవెన్యూ డివిజనల్ అధికారిని దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఆమె మహిళా అయి కూడా మాకు న్యాయం చేయలేదని మహిళ ఆరోపించారు. అదే విధంగా పోలీస్ అధికారుల దృష్టికి కూడా తమ సమస్యను తీసుకువెళ్లినప్ప టికీ పరిష్కారమునకు నోచుకోలేదని మహిళలు ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే పలుమార్లు మండల జిల్లా స్థాయి కార్మిక శాఖ అధికారులు కూడా తమ గోడు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోయిందని మహిళలు వాపోయారు. యాజమాన్యం మాపట్ల ఇంత దుర్మార్గంగా ప్రవర్తించడం అన్యాయం అనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిధంగా చట్ట వ్యతిరేకంగా కంపెనీ యాజమాన్యం పాల్పడుతున్నప్పటికీ అధికారి యంత్రాంగం కూడా నిమ్మక నేరెత్తినట్టుగా వ్యవహరించడం వలన మాకు అన్యాయం జరుగుతుందని మహిళల వాపోయారు. మాకు న్యాయం జరిగే వరకూ మా పోరాటాన్ని ఉధృతంగా కొనసాగిస్తామని మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ.గౌరీ నాయుదు యూనియన్ అధ్యక్షులు ఇప్పిలి గురునాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

స్త్రీనిధి చెక్కును మహిళలకు అందజేసిన మంత్రి అనిత

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : వంటింటి నుండి అసెంబ్లీలో అధ్యక్ష అనే స్థాయికి మహిళలు ఎదిగారు అంటే అన్న ఎన్టీ రామారావు చొరవ అని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయనగరం రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం జిల్లా ఇంచార్జ్ మంత్రి, హెూం మంత్రి వంగలపూడి అనిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు దేవతలుతో సమానమని, అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం సమాజ బాధ్యతని అన్నారు. సమాజంలో మహిళలు రోజురోజుకు ముందుకు వెళ్తున్నారని, మహిళలపై ఆధారపడి ప్రస్తుత ప్రభుత్వాలు నడుస్తున్నాయని అన్నారు. ఆడపిల్లలే ముఖ్యం అని ఇప్పుడు సమాజం భావిస్తుందని, మహిళల కన్నా పురుషులు ఎక్కువగా ఆత్మహత్య చేసుకుంటున్నారని క్రైం రికార్డ్ చెప్తున్నాయని అన్నారు. మహిళలకు ధైర్యం ,ఆత్మస్థైర్యం ఎక్కువని, మహిళలు ఎప్పుడో సాధికారత సాధించారని అన్నారు. డ్వాక్రా సంఘాలు ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారన్నారు. నేను ఒక సాధారణ టీచర్ని, రాజకీయాల అనేసరికి కోట్లు ఉండాలని అనుకుంటారు. కేవలం నా చదువే నా పెట్టుబడి అని అన్నారు. మహిళలు భద్రత విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని ఆడపిల్లల రక్షణకు శక్తి యాప్ ఉందని దాన్ని అందరూ వినియోగించుకోవాలని అన్నారు. ఆడపిల్లలను ప్రతి తల్లిదండ్రి ధైర్యంగా పెంచండి అని అన్నారు .చదువును తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తిగా ఇవ్వాలని కొనియాడారు. ఆడపిల్లలు లాగే మగ పిల్లలను కూడా జాగ్రత్తగా క్రమశిక్షణగా పెంచాలని మగ పిల్లలను మంచి పౌరుడుగా తీర్చిదిద్దండి అని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అతి త్వరలోనే అమలు కానున్నాయని అన్నారు. అనంతరం విజినరీ పుస్తకాన్ని హెూం మంత్రి అనిత ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం శాసనసభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, తూర్పు కాపు చైర్మన్ పాలవలస యశస్వి, జిల్లా కలెక్టర్ అంబేద్కర్, జిల్లా ఎస్పీ వకూల్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు.

పారా రాష్ట్ర స్థాయి విజేతలకు అభినందనలు

- ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు
- ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : ప్రతిభకు వైకల్యం అడ్డు కాదని విజయనగరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పూసపాటి ఆదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. గత నెల మంగళగిరిలో జరిగిన 7వ పారా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి మెడల్స్ సాధించిన జిల్లాకు చెందిన పారా క్రీడాకారులను శనివారం డి ఎస్ డి ఓ కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్. బి. ఆర్. అంబేద్కర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అతిథి గజపతిరాజులు అభినందనలు తెలియజేసారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ క్రీడాకారులను అతిధులకు పరిచయం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు మాట్లాడుతూ ప్రతిభకు వైకల్యం అడ్డు కాదని పారా క్రీడాకారులు నిరూపిస్తున్నారని, ఇతర క్రీడాకారులకు ఏ మాత్రం తీసిపోని విధంగా మెడల్స్ సాధించడమే కాకుండా రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాను రెండో స్థానంలో నిలపడం అభినందనీయమని అన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, దివ్యాంగులంతా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి జిల్లా పేరు, ప్రఖ్యాతలు మరింతగా పెంచాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు మెడల్స్ వేసి, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డి ఎస్ డి ఓ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ ద్వారా స్వల్ప వ్యవధిలో కేసుల పరిష్కారం

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : జిల్లాలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ల ద్వారా మోటారు వాహనాల ప్రమాద కేసులు సత్వర పరిష్కారం జరిగి బాధితులకు పరిహారం త్వరగా అందుతోంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ్ చక్రవర్తి చొరవతో జాతీయ లోక్ అదాలత్‌లో మోటారు వాహనాల ప్రమాదాల కేసులు త్వరగా పరిష్కారం జరిగి బాధితులకు బీమా సంస్థల నుంచి త్వరగా పరిహారం అందుతోంది. పిటిషనర్ తరపు న్యాయవాదులు, జీవిత బీమా సంస్థల సహకారంతో ప్రమాదంలో మరణించిన ఒక వ్యక్తి కుటుంబానికి శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా రూ.70 లక్షల బీమా పరిహారం అందించి సత్వర న్యాయం జరిగేలా జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు పోస్కో కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నాగమణి చర్యలు చేపట్టారు. ఈమేరకు లారీ ప్రమాదంలో మరణించిన మిరియాల గౌరీపతి అనే వ్యక్తి కుటుంబానికి నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ద్వారా జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా న్యాయమూర్తి బి సాయి కల్యాణ్ చక్రవర్తి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. 2021 మార్చి 1వ తేదీన గౌరీపతి రామభద్ర పురం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించగా పరిహారం కోసం బాధిత కుటుంబం కోర్టును ఆశ్రయించారు. లోక్ అదాలత్ ద్వారా ఇరు పక్షాల మధ్య సయోధ్య కుదిర్చి బాధిత కుటుంబానికి త్వరగా పరిహారం అందేలా పోస్కో కోర్టు న్యాయమూర్తి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోస్కో న్యాయస్థానం జడ్జి నాగమణి, నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ప్రాంతీయ మేనేజర్ సుజాత కుమార్, మేనేజర్‌లు సీతాలు, దేదీప్య, న్యాయవాది తాలాడ శాంత కుమార్, బాధిత కుటుంబ సభ్యులు మిరియాల లక్ష్మి, అఖిల్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలిపల్లి పైడితల్లి జాతర... అన్ని ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-రాజాం : రాజాంలో నేటి నుండి 9, 10, 11 తేదీలలో జరగబోయే శ్రీశ్రీశ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకి అన్ని సిద్ధం చేసిన అధికారులు. ఉదయం 5 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ ప్రత్యేక పూజలు చేస్తారు. అప్పటినుండి జాతర ప్రారంభం కానున్నది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేసి, దర్శనానికి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక దర్శనం టికెట్లుతో ప్రత్యేక క్యూ లైన్లు కూడా ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు తాగేందుకు తాగునీటి ఏర్పాట్లు కూడా చేశారు. సీఐ కె.అశోక్ కుమార్ పర్యవేక్షణలో 400 మంది పోలీస్ సిబ్బందితో, 27 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో ఎక్కడ ఏటువంటి సంఘటనలు జరగకుండా పూర్తిగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఫైర్ ఆఫీసర్ జనార్దన్ రావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణ ప్రాంతంలో ఫైర్ సేఫ్టీ సిలిండర్లు వారి సిబ్బందితో ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పల నాయుడు ఆధ్వర్యంలో రోజుకు మూడు షిఫ్టులు వారీగా పారిశుద్ధ కార్మికులు ఎప్పటికప్పుడు ఆలయ ప్రాంగణం అంతా ఎప్పటికప్పుడు పరిశుభ్రత చేయించేందుకు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో బయో టాయిలెట్స్ కూడా మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేశారు. అమ్మవారి గుడి వద్ద నుండి బొబ్బిలి జంక్షన్ వరకు ఈసంవత్సరం ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ రోడ్డుకి ఇరు పక్కల పలు రకాల వ్యాపారస్తులు వ్యాపారాలు ఏర్పాట్లు చేసుకున్నారు. వినోద కార్యక్రమాలకు జైంట్ వీల్, కొలంబస్ పలు రకాల స్టాల్స్ ఖాళీ స్థలంలో ఏర్పాటు అయ్యాయి. సలాది వెంకటరమణ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తరాంధ్ర స్థాయి మహిళా కళాకారులచే పౌరాణిక, జానపద, సాంఘిక పోటీలు నిర్వహిస్తారు. సోమవారం హైదరాబాదు వారిచే ఢీ, జబర్దస్త్, హంగామా ఆర్టిస్టులతో వినోద కార్యక్రమం నిర్వహించబడును. మంగళవారం రాత్రి అమ్మవారి వనం గుడి వద్ద నుండి ఘటాలు రాత్రి 12 గంటలకు ఆలయానికి చేరుకున్న తదనంతరం భారీ బాణసంచా (మందుగుండు) కాల్చిన అనంతరం అమ్మవారి యాత్ర ముగుస్తుంది. ఆలయ ఈవో బీ.వీ.మాధవరావు మాట్లాడుతూ భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు.

వాగ్దేవి విద్యా సంస్థల్లో మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కొత్తవలస : మండలంలోని తుమ్మికపల్లి వద్దనున్న వాగ్దేవి విద్యా సంస్థల్లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ మహిళల అభివృద్ధితోనే మానవాళి అభివృద్ధి ఆధారపడి ఉంది అనే విషయాన్ని అందరూ గ్రహించాలన్నారు. మహిళా అభ్యున్నతికి కుటుంభ స్థాయి నుంచి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వాగ్దేవి కరస్పాండెంట్ కోటిన మహేశ్వర రావు, వాగ్దేవి డైరెక్టర్ సిహెచ్ ప్రవీణ్, ప్రిన్సిపల్ సతీష్, ప్రసాద్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సుందరాడలో ఎస్ఐ పల్లెనిద్ర

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో సుందరాడ గ్రామంలో శుక్రవారం రాత్రి పల్లె నిద్రలో భాగంగా ఎస్ఐ సాగరాబాబు ఆ గ్రామ సచివాలయంలో నిద్రించి గ్రామ ప్రజలతో మాట్లాడుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మీ గ్రామంలో కుల మత భేదాలకు అతీతంగా మీరు కానీ, మీ పిల్లలు కానీ సమానత్వంగా జీవించాలని, ఎటువంటి అల్లర్లు గ్రామంలో రాకుండా మీ ప్రజలంతా అన్యోన్యంగా నడవాలని ఆ గ్రామ ప్రజలకి ఎస్ ఐ సాగర్ బాబు తెలిపారు.

అన్న సంతర్పణకు రూ.50 వేలు విరాళం

విశాలాంధ్ర-పూసపాటిరేగ : మండల కేంద్ర గ్రామమైన పూసపాటి రేగ లో నిర్మించిన సీత రామ దేవాలయం ప్రతిష్ఠ శనివారం జరిగింది. ఈ ప్రతిష్ఠ సమయంలో వచ్చిన భక్తులకు అన్న సమారాధన కొరకు కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు,గోవిందపురం ఉప సర్పంచ్ అప్పల రాజు కలిపి 50 వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రాముని భక్తులు, జనసేనా నాయకులు పాల్గొన్నారు.

పొట్నూరు కుటుంబాన్ని ఎమ్మెల్సీ బొత్స పరామర్శ

విశాలాంధ్ర-గుర్ల : దివంగత మాజీ ఎమ్మెల్యే పొట్నూరు సూర్యనారాయణ సతీమణి పాలవలస సర్పంచ్ పొట్నూరు కనకమ్మ మూడు రోజుల క్రితం మృతి చెందిన సంగతి తెలిసినదే. ఆమె కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సురేష్ బాబు, మాజీ ఎంపీ బెల్లన చంద్రశేఖర్ పరామర్శించారు. కనకమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైకాపా నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడును పరామర్శించారు. వీరితోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

మిరాకిల్‌లో అలరించిన సాంస్కృతి కార్యక్రమాలు

విశాలాంధ్ర-భోగాపురం : మండలంలోని ముంజేరులో ఉన్న మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయనగరం జిల్లా జేఎన్టీయూ యూనివర్సిటీ రిజిస్టర్ జయసుధ ప్రారంభించారు. నిర్వహించిన సాంస్కృత కార్యక్రమాల్లో జిల్లాలోని పలు కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్న పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి . ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు భోగాపురం సర్కిల్ సీఐ ప్రభాకర్ రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ లోకం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కళాశాల డీన్ శ్రీనివాస్ బెహరా, ప్రిన్సిపల్ అర్జున్‌రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

14న ఛలో పిఠాపురం పోస్టర్ విడుదల

విశాలాంధ్ర-కొత్తవలస : పిఠాపురంలో ఈ నెల 14న నిర్వహించనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఏస్.కోట నియోజకవర్గ జనసేన సీనియర్ నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, కొత్తవలస మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి రవికుమార్, వేపాడ మండలం పార్టీ అధ్యక్షులు సుంకర అప్పారావు ఆధ్వర్యంలో శనివారం కొత్తవలసలోని ఎం.కే. విల్లాస్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గొరపల్లి రవి మాట్లాడుతూ ఈనెల 14న పిఠాపురంలో జరుగనున్న ఆవిర్భవసభలో ప్రజా సమస్యలపైన, పార్టీ నిర్మాణముపైన ,పార్టీ భవిష్యత్ ప్రణాళికపై అధినేత పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో పార్టీ పెద్దలు తీర్మానాలు చేసి ప్రకటించడం జరుగుతుందన్నారు. 100శాతం స్ట్రైక్ రేట్‌తో 21మంది ఎంఎల్ఏ లను, కూటమిని గెలిపించుకుని ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన పవన కళ్యాణ్ పార్టీనీ బలోపేతం చేయడానికి నిర్వహిస్తున్న ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఉన్న పార్టీ సభ్యులు, మెగా అభిమానులు, వీరమహిళలు, ప్రజలు పెద్దఎత్తున ఆవిర్భావసభకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

అవయవదానానికి అంగీకారం తెలిపిన మహిళలు

విశాలాంధ్ర-బొబ్బిలి : అభిమాని ఫౌండేషన్ కార్యాలయంలో సంస్థ చైర్మన్ రాజగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో నేత్ర అవయవదాన కార్యక్రమంలో మహిళలు అవగాహన పొంది ప్రతిజ్ఞ పత్రాలను సంస్థ చైర్మన్ రాజగోపాల్ నాయుడుకు అందజేశారు. అభిమాని ఫౌండేషన్ వారి స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం నందు శిక్షణ పొందుతున్నటువంటి మహిళల ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని, సమాజంలో ఎప్పటికప్పుడు ఎదురవుతున్న ప్రమాదాల నుంచి తమని తామే కాపాడుకొనేలా సృజనాత్మక విలువలను పెంపొందించుకోవాలని కోరారు. అభిమాని సంస్థ నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని సమాజంలో స్త్రీ శక్తిని చాటి చెప్పేందుకు చైతన్యం పొందాలని పిలుపునిచ్చారు.

హక్కులు హరించబడుతున్నాయి... మహిళా దినోత్సవంలో ఆవేదన

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : రాజ్యాంగం మహిళలకు హక్కులు కల్పించినప్పటికీ, ఆ హక్కులు సరైన రీతిలో అమలు జరగడం లేదని న్యాయవాది బ్యూలారాణి ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం పురుషులతో సమానంగా మహిళలకు సమానత్వపు హక్కును ఇచ్చినప్పటికీ ఆ హక్కు ప్రకటనలకే పరిమితమైందే తప్ప ఎక్కడ అమలు జరగడంలేదని ఆమె పేర్కొన్నారు. నవ్యాంధ్ర జిల్లా మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ కూడలిలో గల అంబేద్కర్ భవనంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యూలారాణి మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన హక్కుల కోసం మహిళలు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో సీట్లను 33% మహిళలకు కేటాయించడం సమానత్వం ఎలా అవుతుందని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా రాజ్యాంగం మహిళల అభ్యున్నతి కోసం కల్పించిన సమానత్వపు హక్కును పరిపూర్ణంగా అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నవ్యాంధ్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.భవాని మాట్లాడుతూ మహిళలు సమస్యలను ధైర్యంతో ఎదుర్కొంటే ఎటువంటి సమస్య అయినా చాలా చిన్నదిగా ఉంటుందని, ఆ సమస్య పరిష్కారం జరుగుతుందని అన్నారు. సమాజంలో జరిగే తప్పులన్నీ మగవారిపై నెట్టివేయడం మంచిది కాదని, కొన్ని విషయాలలో మహిళలు కూడా తప్పులు చేస్తున్నారని, మహిళలు తమ వైపు నుంచి తప్పులు లేకుండా క్రమశిక్షణతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన పలువురు మహిళలను నవ్యాంధ్ర జిల్లా మహిళా సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయం వ్యవస్థాపకులు షణ్ముఖరావు సతీమణి ప్రమీలా రాణి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, గంట్రేటి నిర్మల, ఆర్ఎంపి సంఘం మహిళ అధ్యక్షురాలు అను, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పరిపాలన కార్యదర్శులు తొలగింపు

విశాలాంధ్ర-విజయనగరం : విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో పన్నుల వసూలు ప్రక్రియలో భాగంగా ముగ్గురు పరిపాలన కార్యదర్శులు తాము వసూలు చేసిన మొత్తాలను విజయనగరం నగరపాలక సంస్థకు సకాలంలో జమ చేయలేదనే విషయమై సమగ్ర విచారణ జరిపించి, ఆ ముగ్గురు పరిపాలన కార్యదర్శులు వారు వసూలు చేసిన మొత్తాలను తిరిగి నగరపాలక సంస్థకు చలానా రూపంలో కట్టించుకున్న అనంతరం, వారిని విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. వసూలు చేస్తున్న మొత్తాలు నగరపాలక సంస్థ అకౌంటు లోకి సకాలంలో జమ అవుతున్నాయా లేదా అని కమిషనర్ పల్లి నల్లనయ్య అకౌంట్స్ అధికారులకు తనిఖీ చేయాలని కొద్ది రోజుల క్రితం ఆదేశించారు. దీనిపై సమగ్ర విచారణ చేయగా, %జు-రా% మాడ్యూల్ లో వున్న "కార్డు" ఆప్షన్ ను ఉపయోగించి, ఈ ముగ్గురు పరిపాలన కార్యదర్శులు వారు వసూలు చేసిన పన్ను మొత్తాలను నగరపాలక సంస్థ ఖజానాలో జమ చేయలేదన్నారు. 49వ డివిజన్ గాజులరేగ-3, సచివాలయం నెంబర్ 59 కి చెందిన పరిపాలన కార్యదర్శిగా ఉన్న ఏనుగుతల ప్రవీణ్ కుమార్ తాను వసూలు చేసిన రు.26,38,238/-లను %జు-రా% మాడ్యూల్ లో "కార్డు" ఆప్షన్ ను ఉపయోగించి, వసూలు చేసిన నగదును నగరపాలక సంస్థకు జమ చేయలేదన్నారు. అంతే కాకుండా 50 వ డివిజన్ గాజులరేగ-2, సచివాలయం నెంబరు 58 అడ్మిన్ కార్యదర్శిగా ఉన్న పొట్నూరు మాధురి లాగిన్ ను కూడా ఉపయోగించి, ఏనుగుతల ప్రవీణ్ కుమార్ మొత్తము రూ.8,375లు వసూలు చేసి సంస్థకు సకాలంలో జమ చేయలేదని ప్రాథమికముగా నిర్ధారించారన్నారు. అలాగే 48వ డివిజన్ గాజులరేగ-1 కు చెందిన 57వ సచివాలయము పరిపాలన కార్యదర్శి కె.సూర్యనారాయణ ఈఆర్పీ మాడ్యూల్లో "కార్డు" ఆప్షన్ ను ఉపయోగించి, వసూలు చేసిన రూ.1,62,270/-లు పన్ను మొత్తాలను నగరపాలక సంస్థకు జమ చేయలేదని ప్రాథమికంగా గుర్తించామన్నారు. 41 డివిజన్ పరిపాలన కార్యదర్శిగా ఉన్న డి.రామకృష్ణ %జు-రా% మాడ్యూల్ "కార్డ్" ఆప్షన్ ను ఉపయోగించి వసూలు చేసిన 37,380 రూపాయలు కూడా నగరపాలక సంస్థకు జమ చేయలేదని నిర్ధారించడమైనది. ప్రస్తుతం ఏనుగుతల ప్రవీణ్ కుమార్, కె.సూర్యనారాయణ మరియు డి.రామకృష్ణలు వసూలు చేసిన పన్ను మొత్తాలను అనగా రూ.28,46,263/-లను 08.03.2025తేదీన చలానాల ద్వారా నగరపాలక సంస్థ ఖజానాకు జమ చేయించడమైనదన్నారు. అనంతరం ఏనుగుతల ప్రవీణ్ కుమార్, కె.సూర్యనారాయణ మరియు డి.రామకృష్ణలను విధుల నుండి సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ఇటువంటి తప్పిదములు ఇకనుండి పునరావృతమై, నగరపాలక సంస్థ ప్రతిష్టకు భంగం వాటిల్లేటట్లు పాల్పడిన వారిని సస్పెండ్ చేయడమే కాకుండా, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి, సచివాలయ కార్యదర్శులకు హెచ్చరించినట్లు తెలిపారు. పన్ను బకాయిదారులు తమ నగదు చెల్లింపులను నగరపాలక సంస్థ క్యాష్ కౌంటర్ నందు గాని, వార్డు సచివాలయములందు గాని చెల్లింపు చేయాలని కోరారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 148 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-రాజాం : రాజాం కోర్టులో రాజాం మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రెండు బెంచ్ లను ఏర్పాటు చేశారు 1.సీనియర్ సివిల్ జడ్జ్ కె.శారదాంబ,2. జూనియర్ సివిల్ జడ్జ్ బి.జోష్న రెండు పెంచులుగా ఏర్పాటు చేశారు. రెండు బెంచ్లలో మొత్తం 148 కేసులు పరిష్కరించారు? 83,55,525/- పరిష్కరించబడిన మొత్తం అమౌంట్. మొత్తము కేసులలో సివిల్ కేసులు-06, భార్య,భర్తల తగాదాలు-04, క్రిమినల్ కేసులు -109, చెక్ బౌన్స్ కేసులు- 05, సారా కేసులు 23, బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసు-01 ఉన్నాయి. ఈ అదాలత్ లో బెంచ్ లలో న్యాయవాద సభ్యులుగా 1) ఆర్.ఈ.సి. హెచ్. జయదేవ్, 2) వై.ఈశ్వరరావు ఉన్నారు. జాతీయ లోక్అదాలత్‌లో వైస్‌ప్రెసిడెంట్ ఆర్.ఈ.సి.హెచ్. జయదేవ్, సెక్రెటరీ వై.ఈశ్వరరావు, సీనియర్ న్యాయవాది రెడ్డి రామమూర్తి, ఇతర సీనియర్, జూనియర్ న్యాయవాదులు, రాజాం పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు

సీనియర్ సివిల్ జడ్జి ఎస్ అరుణశ్రీ

విశాలాంధ్ర-బొబ్బిలి : మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో కేసు నమోదై కఠిన శిక్షలు పడతాయని మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. మండలం ఎం.బూర్జవలసలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు, మహిళలపై దాడులు, వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు పడతాయన్నారు. ఆడపిల్లలకు సమాన హక్కులు ఉంటాయని చెప్పారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలు అందిస్తామని అర్హులైన వారు ఉచిత న్యాయ సేవలకు మండల న్యాయ సేవా సంస్థకు దరఖాస్తు చేస్తే మండల న్యాయ సేవా సంస్థ ప్యానల్ న్యాయవాదులు ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిఎం మోహన్ కుమార్, న్యాయవాది పి.జగన్నాథం, సర్పంచ్ ఎస్.ఈశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'క్రాష్'కు బాలారిష్టాలు

- గత ప్రభుత్వ విధానాలనే పాటిస్తున్న కూటమి సర్కార్
- త్వరితగతిన పూర్తి చేయాల్సిన లక్ష్యం ఆలస్యం
- రెండు టీంలకు బదులుగా ఒకే టీంతో క్రాష్ ప్రోగ్రాం నిర్వహణ
- ఒక మెకానిక్‌కు మాత్రమే పని.. రెండో మెకానిక్ ఖాళీ

విశాలాంధ్ర-విజయనగరం : రాష్ట్రంలో తాగునీటి సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో అమలు చేస్తున్న క్రాష్ ప్రోగ్రాంలో అనేక సమస్యలు బైటపడుతున్నాయి. ప్రస్తుతం గ్రామాలలో వేసవి నేపథ్యంలో మంచినీటి బోర్లును మరమ్మత్తులను చేసేందుకు దాదాపు 45 రోజులపాటు క్రాస్‌ప్రోగ్రాంను మండలాల వారీగా నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడే అసలు విషయాలు దాగి ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. సాదారణంగా మండలానికి ఇద్దరు నుంచి ముగ్గురు మెకానిక్‌లు ఉండి వేర్వేరు ప్రాంతాలలో తమకు కేటాయించిన గ్రామాలలో పనిచేస్తుంటారు. క్రాస్ ప్రోగ్రాం సమయంలో ప్రత్యేకంగా ఒక షెడ్యూల్ ప్రకారం ఒకే వాహనంలో అందరినీ కలిపి ఒకే చోట పనికి పంపిస్తున్నారు. వీరంతా కలిసి ఒక బోరువద్దే పనిచేయడంతో ఒకరికి మాత్రమే పని ఉంటుంది. మిగిలిన వారంతా ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక బోరు రిపేరుకు ఇద్దరు సహాయకులు అవసరం. రెండవ మెకానిక్‌కు సహాయకులు లేకపోవడం విచిత్రం. త్వరతగతిన తాగునీటి అవసరాలను ప్రజలకు తీర్చాలంటే మండలానికి రెండు వాహనాలతో రెండు టీంలుగా విడదీసి 45 రోజులపాటు జరగాల్సిన క్రాస్ ప్రోగ్రాన్ని 23 రోజులలో పూర్తి చేయవచ్చు. దీనివలన ప్రభుత్వానికి ఆర్ధిక భారం కూడా తగ్గుతుంది. అలాగే ప్రజలకు చేతిపంపుద్వారా 24 గంటలూ తాగునీటిని త్వరితగతిన అందించగలలక్ష్యం నెరవేరుతుంది. ఈరకంగా లేకపోవడం వలన క్రాష్ ప్రోగ్రాం సమయంలో మండలాల్లో వేర్వేరు ప్రాంతాలలో వచ్చే రెగ్యులర్‌గా వచ్చే రిపేర్లు కొంత ఆలస్యమవుతోంది. కాబట్టి ప్రతీ మండలంలోనూ ఇద్దరు మెకానిక్‌లు ఉన్నందున వారికి పూర్తి స్థాయి పని కల్పించాలంటే రెండు టీంలుగా విడదీసి రెండు వాహనాలతో రెండు ప్రాంతాలకు వేర్వేరుగా పంపించగలిగితే ప్రజలకు తాగునీటిని పూర్తి స్థాయిలో అందించగలరని ప్రజలు కోరుతున్నారు.

జామి యల్లారమ్మ జాతర హుండి లెక్కింపు

ఈ ఏడాది అదనంగా పెరిగిన ఆదాయం రూ.1.07లక్షలు

విశాలాంధ్ర - జామి : శ్రీయల్లారమ్మా అమ్మవారి అలయం హుండీ లెక్కింపు శనివారం ఉదయం అలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలు సమక్షంలో లెక్కింపు జరిగింది. ఈసంవత్సరం జాతర సందర్భంగా అమ్మవారి టిక్కెట్‌లు, విరాళాలు, ప్రసాదం విక్రయం, కొబ్బరి ముక్కలు వేలం ద్వారా, హుండీల ద్వారా వచ్చిన అదాయం 21,06,124 రూపాయలు వచ్చింది .గత ఏడాది 19,98,451 రూపాయలు ఆదాయం రాగా ఈ ఏడాది 1,07,673 రూపాయలు పెరిగినట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ ఇనస్పెక్టర్ యం.ప్రసాద్ తెలిపారు. ఈలెక్కింపు సమయంలో గ్రామ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, అల్లుపద్మ, జామి ఎ ఎస్.ఐ అర్.నరసింహమూర్తి, అలయ ఇవో యం.ప్రసాద్, విఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ హుండీ లెక్కింపులో విజయనగరం పైడితల్లి అమ్మవారి సేవా సంఘం సభ్యులు కె.సూర్యారావు ఆధ్వర్యంలో సుమారు ఏభై మంది సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-రాజాం : ఈ రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం వెలుగు - డిఆర్డిఎ, మెప్మా ఆధ్వర్యంలో రాజాం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ మంత్రి,శాసన సభ్యులు కొండ్రు మురళీ మోహన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ రోజు మహిళలు మగవారికి దీటుగా అన్ని రంగాల్లో రాణించడం జరుగుతుందని, రాబోయే కాలం లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించుటకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యులందరు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు సక్రమంగా సద్వినియోగం చేసుకొని, జీవనోపాధి కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొని ప్రతీ మహిళా యొక్క కుటుంబం సంవత్సరానికి లక్ష రూపాయలు ఆదాయం సంపాదించి ప్రతీ ఇంటిలో ఒక మహిళా పారిశ్రామిక వేత్తగా తయారు చేయాలన్నదే ప్రభుత్వం యొక్క లక్ష్యం అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన మహిళలకు ఎమ్మెల్యే కొండ్రు సత్కరించడం జరిగింది. కార్యక్రమంలో తెలుగుదేశం నాయుకులు గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీను, దూబ ధర్మారావు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఏ. చిరంజీవి, రాజాం ఎంపీడీవో వావిలపల్లి శ్రీనువాసరావు, మెప్మా టీఎంసి రత్నం, రాజాం, రేగిడి, సంతకవిటి, వంగర ఏపిఎంఎస్ హేమలత, గోవిందరావు, మంగమ్మ మరియు సీతారాం పాల్గొన్నారు.

విజయనగరం ఫోర్ట్ : అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో



శనివారం ఉదయం మహాకవి గురజాడ అప్పారావు గృహంలో అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు త్యాడ రామకృష్ణారావు(బాలు) మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నడక ఉద్యమానికి నడుం బిగిస్తున్న మహిళా సేవా మూర్తులు వాకర్స్ ఇంటర్నేషనల్ గోల్డ్ డోనర్, 42 వ డివిజన్ కార్పొరేటర్ పిన్నింటి కళావతిని, వనితా వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు ముళ్ళాపూడి శుభ్రాదేవిని ,బాలజీ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు దంతులూరి నాగలక్ష్మిని, దత్తసాయి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు చిట్టెళ్ల శేష శైలజ ని,మరియు గొప్ప నిస్వార్థ సంఘసేవకులు గురజాడ ఇందిరా ప్రసాద్ కు ఘనంగా క్లబ్ పెద్దలంతా వేద ఆశీర్వాదములతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా హాజరైన వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 102 ఎలక్ట్ గవర్నర్ ఆరికతోట తిరుపతిరావు, క్లబ్ గౌరవ అధ్యక్షులు పిన్నింటి సూర్యనారాయణ, డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు మాస్టారు మాట్లాడుతూ సృష్టికి మూలమైన మహిళను ఒకప్పుడు వంటింటి కుందేలుగా చూసేవారని, ఇప్పుడు ఆమె అంతరిక్షపు అంచులను తాకి వస్తోందని, పురుషుడే బలవంతుడని స్త్రీ బలహీనురాలని భావించే రోజులు పోయాయని, పురుషులతో సమానంగా మహిళలు కూడా ముందడుగు వేస్తూ విజయాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుతున్నారు. మహిళ అడుగుపెట్టని రంగమే నేడు లేదని, మనిషి ఉనికికి కారణమైన మహిళ కోసం ఎంత చెప్పినా తక్కువే అని మహిళలు యొక్క గొప్ప తనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ, ప్రగతి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పప్పు విశ్వనాథం, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పిడుగు సతీష్, వాకర్స్ ఉద్యమకారులు ఈపు విజయకుమార్, రామరాజు, లక్కీ శేఖర్,జి. సూర్యప్రకాశరావు, క్లబ్ పెద్దలు, జనసేన యువ నాయకులు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, లాలిశెట్టి రవితేజ, చిట్టి రాజు, లంకపట్నం కుమార్ తదితరులు పాల్గున్నారు.

రాజాం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మానవతా చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్, అధ్యక్షులు బి.వి అచ్యుత కుమార్, కార్యదర్శి నీలకంఠేశ్వర యాదవ్ ,ముఖ్య అతిథులు టౌన్ సీఐ అశోక్ కుమార్, రూరల్ సీఐ ఉపేంద్ర, మక్కా అప్ప నాయుడు, గట్టి పాపారావు మొదలగువారి సమక్షంలో వివిధ రంగాల్లో సత్తా చాటిన మహిళకు సత్కారం చేయడం జరిగింది.

సన్మాన గ్రహీతలు : 1) డాక్టర్ ప్రతిమ, 2) డాక్టర్ ఎం.సిద్దేశ్వరి, 3)కిలారి లక్ష్మి, 4) కె. సుజాత, 5)వడ్డీ ఉషారాణి, 6) జగదీశ్వరి.

ఈ సందర్భంగా టౌన్ సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ మహిళల విషయంలో చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, పురుషుల ఆలోచన సరళి మారాలని తెలియజేశారు. రూరల్ సీఐ ఉపేందర్ మాట్లాడుతూ మహిళను గౌరవించడం అంటే మన తల్లిని గౌరవిస్తున్నట్టే అని భావించాలని, స్త్రీ పురుషులకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలని తెలియజేశారు. చైర్మన్ కొత్త సాయి మాట్లాడుతూ తమరంగాల్లో సత్తా చాటిన మహిళా మణులు మిగిలిన మహిళలకు స్ఫూర్తిగా ఉండాలని ఆదర్శంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజాం మానవతా సభ్యులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట రూరల్ : మహిళా శక్తి తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని

మహిళలు తమ వంటింటి నుంచి ఏకంగా అంతరిక్షానికి ఎదగడమే దానికి నిదర్శనమని ప్రముఖ వైద్య నిపుణురాలు పొట్నూరూ వరలక్ష్మి.. ప్రముఖ మహిళా న్యాయవాది ముక్కు అనురాధ అన్నారు. శనివారం మండలంలోని బొడ్డవర గ్రామంలో వాసవి మహిళా సంఘం అధ్యక్షురాలు పూసర్ల కోటీరత్నం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ వరలక్ష్మి న్యాయవాది అనురాధలు మాట్లాడుతూ నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ తమ సత్తా చాటుతున్నారని అదేవిధంగా సేవా కార్యక్రమాల్లో మరింతగా దూసుకువెళ్లి తమకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సాధించాలని తమదైన ముద్రను ఈ చరిత్రలో వేయాలని సూచించారు.. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ వాసవి మహిళా క్లబ్బుల ద్వారా విద్య వైద్యం వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.. ఆర్యవైశ్య సంఘ మహిళా ప్రతినిధి రవి కుమారి మాట్లాడుతూ మహిళా దినోత్సవం ఎలా ఏర్పడింది.. దీనివలన మహిళా శక్తి ఎలా పెరిగింది అనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వాసవి సంఘం మహిళా ప్రతినిధులు పద్మ ధనలక్ష్మి శైలజ. అన్నపూర్ణ. భారతి. భార్గవి. పల్లవి. కుసుమ. మహాలక్ష్మి. విజయ. సంతోషి. సత్య. శాంతి. పద్మ తదితరులు ఉన్నారు. అనంతరం ముఖ్య అతిథులు డాక్టర్ వరలక్ష్మి.. న్యాయవాది అనురాధ.. ప్రిన్సిపల్ జానకి దేవి . పి శ్రీదేవి లను ఘనంగా సత్కరించారు.

గరివిడి : స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం మధ్యాహ్నం ప్రిన్సిపల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎస్.మధులత ప్రొఫెసర్ మెకానికల్ విభాగం,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఎచ్చర్ల నుండి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో నేటి మహిళలు మగవారితో సమానంగా ఎదుగుతున్న మహా వృక్షాలు తెలిపారు. తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ,తొలి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు,తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే, సినిమా రాజకీయ,వాణిజ్య,వ్యాపార తదితర రంగాల్లో

రాణిస్తున్న మహిళలను ఆదర్శంగా తీసుకోని మీరు రానిస్తేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యాక్రమానికి అతిధిగా బ్రహ్మకుమారిస్ హేమలత గారు,గరివిడి నుండి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీకి చాలా ఓర్పు, సహనం ఎక్కువని తద్వారా చాలా విజయాలను అందుకోగలుగుతుందని తెలిపారు. స్త్రీ శివశక్తి లాంటిదని,స్త్రీ ఎక్కడ ఉంటే అక్కడ దేవతలు వుంటారని తెలిపారు. నేడు స్త్రీలు అన్ని రంగాలలో ముందున్నారని,ఈ సంఖ్య మరింత పెరగాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి.జాషువా జయప్రసాద్ గారు మాట్లాడుతూ స్త్రీ శక్తి అసాధారణమైనది,ఆమె ఎక్కడ పని చేసినా ఆ ప్రదేశం భోగ భాగ్యాలతో వర్ధిల్లుతుంది. ఆమె తన చుట్టూ ఉన్న ప్రపంచంలో మార్పు తెచ్చేందుకు ఎంతో కృషి చేస్తుంది. అంతరిక్ష యానం చేసిన మొదటి మహిళ కల్పనా చావ్లా,రెండవ మహిళా సునీత విలియమ్స్,మొదటి ఐపీఎస్ అధికారిణి కిరణ్ బేడి తదితర వీర నారీమణులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అతిధులకు సన్మానం చేయడం జరిగింది. అలాగే విద్యార్థినిలకు ఆటల పోటీలు,డిబేట్ మరియు వ్యకృత్వ పోటీలు నిర్వహించి ప్రథమ,ద్వితీయ స్థానాలకు అతిధి మీదగా బహుమతులు అందజేయడం జరిగింది. అలాగే కళాశాలలో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయులును,బోధనేతర సిబ్బందిని జ్ఞాపికలతో గౌరవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్ కుమార్,వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు,విద్యార్థినిలు,బోధనేతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం : మండలంలో బిల్లలవలస ఉన్నత పాఠశాలలో మరియు

గర్భాం శ్రీ రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక గర్భాం రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా తెలుగు ఉపాధ్యాయుడు మరడాన సత్య రావు మాస్టారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యారావు మాస్టర్ మాట్లాడుతూ ఓర్పు సహనం అనేవి స్త్రీలకు ఉన్న రెండు సహజ గుణాలని తద్వారా పలు విజయాలు ఆమె సొంతం అని అన్నారు. ఈ రోజుల్లో పలు రంగాల్లో స్త్రీలు అత్యున్నత స్థాయికి చేరారని, ప్రతి ఒక్క పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ ఉంటుందని అన్నారు. తొలి మహిళా ప్రధానమంత్రిగా శ్రీమతి ఇందిరాగాంధీ, తొలి మహిళా గవర్నర్ గా సరోజినీ నాయుడు, తొలి మహిళా ఉపాధ్యాయ రాలిగా సావిత్రిబాయి పూలే ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో నారీమణులు అత్యున్నత స్థాయికి ఎదిగారని సత్యా రావు మాస్టారు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో ఆటవిడుపుగా మ్యూజికల్ చైర్, పొడుపు కథలు పోటీ వంటివి నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం ఆటల్లో గెలుపొందిన మహిళా ఉపాధ్యాయుని లకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ విజినిగిరి శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.హేమాస్ రావు, స్కూల్ ఇంచార్జ్ ఎం.శంకర్, ఏవో ఎం. శైలజ, మహిళా ఉపాధ్యాయనిలు రమాదేవి, భవాని, మంగ, సంధ్య, మమత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా సమృద్ధి యోజన కొరకు కృషి జరుపుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యదర్శి కిమిడి మల్లిక్ నాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చీపురుపల్లి పట్టణ ప్రధాన కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన పార్టీలో కూడా పార్టీ అభివృద్ధి కొరకు కృషి జరుపుతున్న పలువురు మహిళా ప్రతినిధులను పుష్పగుచ్చాలు సాలువులు అందజేసి సన్మానం జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో రాష్ట్రంలో మహిళల రక్షణ కొరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రత్యేకించి మహిళలు అని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్నారు. రానున్న రోజులలో ప్రతి మహిళ ఇంటి వద్ద నుండే వర్క్ ఫ్రం హెూం పేరుతో ఆర్థికంగా బలపడుటకు ప్రభుత్వాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామనాయుడు, కనకమాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ దండాల రామచంద్రుడు, గరివిడి మాజీ ఎంపీపీ పైన బలరాం, గరివిడి నాయకులు ఆరిపాక సురేష్, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకులు ముల్లు రమణ, తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ కమిటీ కన్వీనర్ ఆరతి సాహూ, ఎస్సీ సెల్ ప్రతినిధి సబ్బి సోనియా, చీపురువల్లి గరివిడి మెరకముడిదం గుర్ల మండలాలకు చెందిన పలువురు మహిళా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనగా వారిని ఘనంగా సన్మానించారు.

వంగర : అమ్మను పూజించు, భార్యను ప్రేమించు, సోదరిని దీవించు, ముఖ్యంగా మహిళలను గౌరవించు పేర్కొంటూ మహిళల తోనే సమాజ సృష్టని రాజాం నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు, విజయనగరం జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మజ్జి గణపతి అన్నారు. శనివారం నాడు వంగరలో ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా విలేఖర్లతో మాట్లాడారు.

అంతర్జాతీయ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ మాట్లాడారు. మహిళాలే మహారాణులుగా పేర్కొంటూ సహనమూర్తి, నిత్యస్ఫూర్తి, భూమి కంటే ఎక్కువ భారం మోసే మహిళలకు పాదాభివందనంగా వివరిస్తూ, స్త్రీ లేకపోతే జననం లేదు. స్త్రీ లేకపోతే గమనం లేదు, స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదనియు, స్త్రీ లేకపోతే అసలు సృష్టే లేదు కంటిపాపలా కాపాడే 'స్త్రీమూర్తి'గా ఆయన వర్ణించారు. ముఖ్యంగా మహిళలుకొవ్వొత్తిలా కరుగుతూ, కుటుంబానికి వెలుగునిస్తూ, కన్నీళ్లనే దాహంగా తీర్చుకుంటూ, కుటుంబమే సర్వస్వంగా జీవించే మహిళలుగా ఆయన వివరించారు.

11న శ్రీ పరదేశిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవానికి భారీ ఏర్పాట్లు

విశాలాంధ్ర-సబ్బవరం : సబ్బవరం మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో గ్రామ ప్రజలు ఆరాధ్య దైవం అయిన శ్రీ పరదేశమ్మ అమ్మవారి పండగ మహోత్సవం ఈనెల 11వ తేదీన ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ బోకం సోమినాయుడు విలేకరులకు శనివారం సాయంత్రం తెలిపారు. 10తొలి వేల్పు 11 న అనుపు మహోత్సవం జరుగునని, ఈ పండుగకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో సర్పంచ్ స్వామినాయుడు మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6 గంటల నుండి అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించబడును అని తెలిపారు అలాగే సాయంత్రం చిరతలు, మందుగుండు సామగ్రి తో అమ్మవారి ఘటాల భారీ ఊరేగింపుతో అనుపు మహోత్సవం నిర్వహించబడును అని తెలిపారు. ఈ పండుగ పురస్కరించుకుని 10 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుండి రాష్ట్ర స్థాయి చిరతలు(డీజే కోలాటమలు) పోటీలు నిర్వహించబడునని,ప్రథమ బహుమతి 12 వేల,ద్వితీయ బహుమతి 10 వేల, మూడవ బహుమతి 8 వేలు, నాలుగో బహుమతి 6వేల, 5వ బహుమతి 4వేలు ఇవ్వబడును అని తెలిపారు. 11 వ తేదీ ఉదయం 10 గంటల నుండి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించబడును అని తెలిపారు.ప్రథమ బహుమతి 12 వేల,ద్వితీయ బహుమతి 10 వేల, మూడవ బహుమతి 8 వేలు, నాలుగో బహుమతి 6వేలు ఇవ్వబడునని తెలిపారు.రాత్రి 8 గంటల నుండి ఎమ్మెల్యే ఈవెంట్స్ మరియు లహరి సౌండ్ వారి ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పలు సంస్కృత కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు.ఈ సంస్కృత కార్యక్రమానికి స్పెషల్ గెస్ట్ లు సినీ కళాకారులు వస్తారని తెలిపారు.భక్తులు ,ప్రజలు పాల్గొని అమ్మవారి కృపా కటాక్షములకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

దుష్ప్రచారానికి పాల్పడటం దిగజారుడుతనానికి నిదర్శనం : కొండపల్లి శ్రీనివాసరావు

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: స్త్రీ నిధి బ్యాంక్ మండల సమాఖ్య భాగస్వాములను చేస్తూ రూ. 60 కోట్ల మూలధనంతో 2011లో ప్రారంభమైందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. అశోక్ బంగ్లాలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బ్యాంక్ మహిళలకు సూక్ష్మ రుణాలు మంజూరు చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. స్త్రీ నిధి బ్యాంక్ ప్రతి ఏడాది రూ. 2400 కోట్లు స్వయం సహాయ సంఘాల ద్వారా మహిళలకు రుణాలు ఇస్తుందని అన్నారు. గత ప్రభుత్వం స్త్రీ నిధి బ్యాంక్ నుంచి రూ. 950 కోట్లు పీడీ ఎకౌంట్ కు మళ్లించి ఎన్నికలకు ముందు రూ. 200 కోట్లు తిరిగి చెల్లించారని, మిగిలిన రూ 750 కోట్లలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.150 కోట్లు తిరిగి చెల్లించారని కొనియాడారు. స్త్రీ నిధి బ్యాంక్ నిధులను దారి మళ్లించిన గత పాలకులు బ్లూ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు దుష్ప్రచారానికి పాల్పడటం వారి దిగజారుడు తనానికి నిదర్శనం అని అన్నారు.కళ్యాణ లక్ష్మి పథకం ప్రారాంభించాలన్న ఆలోచన చేశామన్నారు. స్త్రీ నిధిలో ఉన్నవి స్వయం సహాయ సంఘాల మహిళల స్వంత నిధుల నుంచి యస్ హెచ్ జి

మహిళల సొంత అవసరాలకు ముఖ్యంగా వారి పిల్లల పెళ్లిళ్లకు, ఉన్నత చదువులకు అతి తక్కువ వడ్డీకి ఇవ్వాలన్న ఆలోచన చేశామన్నారు.మహిళల అభివృద్ధికి పెద్దపీట వేసింది తెలుగుదేశం పార్టీ గతంలో స్వర్గీయ అన్న ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల స్వయం సంవృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని హతమార్చిన కేసులో ముగ్గురు అరెస్ట్

విశాలాంధ బిఅనకాపల్లి: ఆర్థిక లావాదేవీల వలన వచ్చిన మనస్పర్థల నేపథ్యంలో స్నేహితుని మరో ముగ్గురు స్నేహితులు పథకం ప్రకారం హతమార్చిన కేసులో ముగ్గురు నిందితులను రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి శనివారం డీఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డి.ఎస్.పి బి .మోహన్ రావు కేసు వివరాలు వెల్లడించారు. బుచ్చయ్యపేట మండలం కాకర గ్రామానికి చెందిన మృతుడు భీమవరపు నూకేష్ కుమార్ డాక్ యార్డ్ లో కాంట్రాక్టర్ వర్కర్ గా పని చేస్తున్నాడు. మృతునికి గోరస నాగేశ్వరరావు, పెదపూడి కిషోర్, మారేడుపూడి రాజేష్ అనే అనే ముగ్గురు స్నేహితులు ఉన్నారు. వీరు నలుగురు కలిసి కొన్ని వ్యాపారాలు చేశారు. వ్యాపారాల్లో ఆర్థిక లావాదేవీలు వలన ఇబ్బందులు రావడంతో గొడవలు మొదలయ్యేయని తెలిపారు . గోరస నాగేశ్వరరావు షార్ట్ ఫిలిం లో డమ్మీ పిస్టల్ కోసం మృతుడు భీమవరపు నూకేశ్ కుమార్ 10000 నాగేశ్వరరావు తీసుకొని ఇవ్వలేదని గట్టిగా నిలదీయగా కోపం పెంచుకున్న కిషోర్ తో మాట్లాడి ఎలాగైనా సూకేష్‌కుమార్ చంపేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు.

అందుకుగాను 1,50,000 మాట్లాడుకుని రాజేష్ సహకరంతో ఈనెల 5న కుంచంగి డాబాలో పార్టీ ఉందని చెప్పి తీసుకువెళ్లి సర్జికల్ బ్లేడుతో నూకష్ కుమార్ పీక కోసి హతమార్చినట్లు తెలిపారు. కేసు సమోదు చేసిన రూరల్ పోలీసులు దర్యాప్తు వేగపంతంగా చేసి నిందితులను శనివారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డిఎస్పి తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ బి .అశోక్ కుమార్. ఎస్సై జి. రవికుమార్ తదితరులు ఉన్నారు.

టీబీ వ్యాధి నిర్ధారణకు ఎక్స్‌రే పరీక్షలు : ఎం.ఎల్.హెచ్.పి.భారతి

విశాలాంధ్ర-లక్కవరపుకోట : టీబీ వ్యాధి నిర్ధారణ కొరకు ఎక్రే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రంగరాయపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎం. ఎల్. హెచ్. పి/సి హెచ్ ఓ. గుంటు భారతి తెలిపారు. శనివారం రంగరాయపురం గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో కేంద్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన వంద రోజులు టీవీ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు టీవీ ఎక్సరే పరీక్షలు నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారికి, షుగర్ వ్యాధి, గతంలో టీబీ వ్యాధి కుటుంబీకులు, దూ మ, మద్యపాన, హెచ్ఐవి, ఎత్తుకు తగ్గ బరువు లేనివారికి ఈ టీబీ వ్యాధి సోకే అవకాశం ఉంటుందని వీరికి ఈ రకమైనటువంటి పరీక్షలు నిర్వహించి నిర్ధారణ అయిన తర్వాత ఉచితంగ మందులు వాడే విధంగా వైద్యులు సూచనలు చేస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమము రాష్ట్రంలోని విజయనగరం జిల్లా ను ఎంపిక చేసి ప్రతి గ్రామంలో ఈ ఎక్స రే పరీక్షలు నిర్వహించి గ్రామస్థాయిలో టీ. బి వ్యాధి లేకుండ టి. బి రైతు గ్రామముగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎన్.ఎం.లు ఏ.దేవి, ఐ శశికళ, జిల్లా డి.ఆర్.టి.బి, హెచ్.ఐ.వి కోఆర్డినేటర్ డి నాగరాజు, సీనియర్ టి. బి ల్యాబ్ సూపర్వైజర్ బి బలరామ నాయుడు, ఆశావర్కర్ విభూది ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లపై అంగన్వాడీలకు అవగాహన

విశాలాంధ్ర-తెర్లాం : తెర్లాం మండలం ఎంపీడీవో ఆఫీస్ నందు శుక్రవారం మరియు శనివారం రెండు రోజులు ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్-ఢిల్లీ, వారిచే అయోడిన్ లోపం, మంచి ఆహారపు అలవాట్లు మరియు ఐరన్ లోపం వలన ఎటువంటి అనారోగ్యాలు వస్తాయనే దానిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి టీచర్స్ కి అవగాహన సదస్సు రెండు రోజు ట్రైనింగ్ సర్టిఫికెట్స్ కూడా అందజేసారు. ఐజిడి జిల్లా కోఆర్డినేటర్ వై.అశోక్ మాట్లాడుతూ ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ వారు చేస్తున్న సమాజ సేవ కార్యక్రమాలను వివరించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు శుభాకాంక్షలు తెలియచేస్తూ మహిళల గొప్పతనాన్ని తెలియజేశారు. విజయనగరం గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ చెందిన డాక్టర్ ఎం చైతన్య , ఎంబీబీఎస్ నిన్నటి దినాన అయోడిన్ లోపం వల్ల ఎటువంటి అనారోగ్యాలు వస్తాయనీ, అయోడిన్ ఏ స్థాయిలో తీసుకోవాలి ? అయోడిన్ లోపించడం వల్ల పిల్లలు గర్భిణీలు స్త్రీలు బాలింతలు ఎటువంటి అనారోగ్యానికి గురవుతారు? అన్న విషయాలను వివరించారు . రఈ రోజు మంచి ఆహారపు అలవాట్లు మీద మరియు శరీరంలో ఐరన్ గురించి వివరిస్తూ కొన్ని యాక్టివిటీస్ నిర్వహించారు. ఆకుకూరలు, పప్పు దినుసులు,పాలు, గుడ్లు,డ్రై ఫ్రూట్స్, బీన్స్,క్యారెట్,బెల్లం,చిక్కిళ్ళు, నిత్యం తగు మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అంగన్వాడి సెంటర్లో పౌష్టికాహారాన్ని అందిస్థామన్నారు. ఈ కార్యక్రమంలో ఓ.ఆర్.డబ్ల్యు సిబ్బంది ఎస్.అజయ్, కే.స్వాతి, పి.పైడిరాజు, ఆర్.అజయ్ & ఎం.సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి మందిరం 18వ వార్షికోత్సవం

విశాలాంధ్ర-కె.కోటపాడు : మండలంలోని కింతాడ పంచాయతీ శివారు కూండ్రపువానిపాలెంలో శ్రీ రామ, సత్యసాయి మందిరం 18వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మందిరంలో జోగన్నపాలెం, రామచంద్రపురం, కూండ్రపువానిపాలెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు నామ సంకీర్తన, భజనలు చేశారు. అనంతరంశ్రీ సత్య సాయి భజన మండళ్ల ఇన్చార్జి కన్నూరు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర సేవా సహ సమన్వయకర్త రాఘవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ భారత దేశంలో భగవంతుడు పుట్టాడని ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నుంచి భక్తులు వచ్చి శ్రీ సత్యసాయి ఆశీస్సులు పొంతున్నారన్నారు. శ్రీ సత్య సాయి భగవంతుడు చూపిన సేవా మార్గంలో అందరూ పయనించాలన్నారు. మానవుడికి సేవచేస్తే మాదవుడికి సేవ చేసినట్టేనని రాఘవరావు గుర్తు చేశారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ శ్రీ సత్యసాయిబాబా అనుగ్రహ ఆశీస్సులతోనే శ్రీ రామ,సత్య సాయి మందిరం నిర్మించుకోగలిగామన్నారు.కన్నూరు అప్పలనాయుడు మాట్లాడుతూ భక్తుల సంకల్పం, శ్రమదానంతో మందిరాన్ని నిర్మించుకుని అందరం భక్తి,మార్గాన పయనిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో శ్రీ రావలమ్మ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ యజమాని కన్నూరు సూర్యనారాయణ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలను వడ్డన చేశారు.ఈ వార్షికోత్సవంలో శ్రీ సత్యసాయి భజన మండళ్ళ కె.కోటపాడు సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, జె. ఎస్.ఎం.ఫిల్లింగ్ స్టేషన్ అధినేత జూరెడ్డి రాము, సాయి భక్తులు దార్ల గురన్నాచారి, సక్కెళ్ళ మల్లేష్, బండారు కన్నబాబు, చుక్క దేముడు తదితరులు పాల్గొన్నారు.